సాక్షి
వికారాబాద్
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



భానుడి భగ భగ!

రెండు రోజులుగా ఎండలు ముదురుతున్నాయి. జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బకు గురికాకుండా ఉండవచ్చని వైద్యులు అంటున్నారు. 8లో▸




వైభవంగా పల్లకీ సేవ

తాండూరు పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ జాతరను వైభవంగా నిర్వహించారు. 8లో▸



అటకెక్కిన స్వయం ఉపాధి

కొడంగల్ నియోజకవర్గంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం నిరుద్యోగులు ఆరేళ్లుగా నిరీక్షిస్తున్నారు. 9లో▸



న్యూస్‌రీల్

మే ఒకటి నుంచి సమ్మర్ క్యాంపులు

అనంతగిరి: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరపున మే 1నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని పది కేంద్రాల్లో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి హన్మంతురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు,కోచ్‌ల ఆధ్వర్యంలో ఈ క్యాంపులు కొనసాగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక రుసుంతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9గంటల వరకు, అలాగే సాయంత్రం 4నుంచి 7గంటల వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షకులకు రూ. 4వేలు గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 96766 38201లో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద గుంతను పరిశీలిస్తున్న కమిషనర్, బీఆర్‌ఎస్ నేతలు

తాండూరు: అంబేడ్కర్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్ రాజుగౌడ్ తెలిపారు.బుధవారం తాండూరు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు, వెంకట్‌రెడ్డి, రాజుతో కలసి పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌ను సందర్శించారు. అక్కడ అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ వల్ల జయంతి ఉత్సవాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని కమిషనర్‌కు తెలిపారు. విగ్రహం పక్కన ఉన్న గుంతను పూడ్చాలని కోరారు.

చైల్డ్ పోర్నోగ్రఫీని సర్చ్ చేస్తే జైలుకే

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఇంటర్‌నెట్, సోషల్ మీడియా చైల్డ్ పోర్నోగ్రఫీ, అశ్లీల వీడియోలు, ఫొటోలు సర్చ్ చేస్తే జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇలాంటి అలవాట్లు ఉన్న వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీసు విభాగం చైల్డ్ పోర్నోగ్రఫీని దొంగచాటుగా చూస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. బాలల లైంగిక వేధింపు అంశాలను వీడియోలు, ఫొటోలను ప్రసారం చేసినా, ఇంటర్నెట్‌లో సర్చ్ చేసినా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గుర్తిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై పలుచోట్ల కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

మార్కెట్ ఆదాయంపై పత్తి ప్రభావం

- రెండేళ్లుగా తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు తగ్గుతున్న రాబడి
- పత్తి దిగుబడి తగ్గడమే కారణం
- 2020 - 21లో రూ. 3.91 కోట్ల ఇన్‌కమ్
- 2021 - 22లో రూ. 2.70 కోట్లు
- ఈ ఏడాది రూ.1.22 కోట్లు మాత్రమే..



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

తాండూరు: ఏడాది పాటు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే మార్కెట్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు గుర్తింపు ఉంది. గత ఏడాది కంటే ఈ సారి అధికంగా పంట ఉత్పత్తులు సేకరించినా మార్కెట్‌కు మాత్రం ఆదాయం తగ్గింది. ప్రధాన పంట పత్తి సగానికి సగం పడిపోవడమే ఇందుకు కారణం. మరోవైపు వరి ధాన్యం ఎప్పుడూ లేనంతగా ఈ ఏడు 4.12లక్షల క్వింటాళ్లు మార్కెట్‌కు రావడం విశేషం. తాండూరు మార్కెట్ యార్డులో 80 మంది వరకు కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. యార్డుకు వచ్చిన పంట ఉత్పత్తులను ప్రతి రోజూ ఈ నామ్ ద్వారా బిడ్డింగ్ నిర్వహించి ధర నిర్ణయిస్తారు. కంది, మొక్కజొన్న, వేరుశనగ ఉత్పత్తులు మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తారు. పత్తి ఉత్పత్తులను జిన్నింగ్ మిల్లుల్లో నేరుగా కొనుగోళ్లు జరుగుతాయి. అయితే 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 8.60లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో రూ. 306.92కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో మార్కెట్‌కు రూ. 3.06కోట్ల ఆదాయం సమకూరింది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో తాండూరు మార్కెట్ యార్డులో జరిగిన కొనుగోళ్లు

పంట	క్వింటాళ్లు	వ్యాపారం	మార్కెట్ ఫీజు
పత్తి	1,63,860	122,90,77,000	1,22,90,770
కందులు	1,77,229	99,30,55,000	99,30,550
పెసర	5,213	3,47,80,000	3,47,800
మినుములు	5,9,26	4,54,53,000	4,54,530
శనగలు	1,812	64,02,000	64,020
వేరుశనగ	67,413	2,35,12,000	2,35,120
మొక్కజొన్న	11,337	2,54,77,000	2,54,770
వరి ధాన్యం	4,12,031	63,67,52,000	63,67,520
సోయా	5,894	2,96,31,000	2,96,310
తెల్ల కుసుమ	35	30,000	300
ఇతర పంటలు	9,690	4,51,24,000	4,51,240

రెండేళ్లుగా పడిపోతున్న ఆదాయం

2020–21 ఆర్థిక సంవత్సరంలో 8.29లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తుల కొనుగోలు ద్వారా రూ. 391,67 కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ. 3.91కోట్ల ఆదాయం సమకూరింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 5.86లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తులు కొనుగోలు చేయగా రూ.389 కోట్ల వ్యాపారం జరిగింది. ఫీజు రూపంలో రూ. 3.89 కోట్ల ఆదాయం లభించింది. రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో రికార్డు సాధించినా మార్కెట్‌కు ఆశించిన మేరకు ఆదాయం రాలేదు. ఇందుకు కారణం పత్తి దిగుబడి పడిపోవడమే..

పత్తి దిగుబడి తగ్గడంతో..

2021 – 22 సంవత్సరంలో పత్తి దిగుబడి భారీగా పెరగడం, మంచి ధర లభించడంతో వ్యాపారం లాభసాటిగా సాగింది. 3.75 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లతో రూ. 270,53కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో మార్కెట్ కమిటీకి ఒక శాతం ఫీజు రూపంలో రూ. 2.70 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే గతేడాది అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. పంట కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి. ఈ ఏడాది 1.63లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లతో రూ. 122,90కోట్ల వ్యాపారం జరిగింది. మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ.1.22 కోట్లు మాత్రమే సమకూరింది. దీంతో మార్కెట్ ఆదాయానికి గండి పడింది.

పత్తి దిగుబడి తగ్గింది



తాండూరు మార్కెట్ యార్డులో ఈ సారి పంట ఉత్పత్తులు అధికంగా వచ్చాయి. కానీ ప్రధాన పంట పత్తి దిగుబడి భారీగా పడిపోయింది. దీంతో ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగలేదు. ఈ సారి వరి ధాన్యం మార్కెట్‌కు అధికంగా వచ్చింది. ధాన్యం కొనుగోళ్లు జరిగినా మార్కెట్‌కు ఆదాయం అంతగా రాలేదు.

– రాజేశ్వరి, కార్యదర్శి, మార్కెట్ కమిటీ, తాండూరు

అత్యాచారం.. హత్య

- ప్లాస్టిక్ సంచిలో కుక్కిన మహిళ మృతదేహం లభ్యం
- తుక్కుగూడలో కలకలం
- వివరాలు వెల్లడించిన పోలీసులు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్‌లు



మృతురాలి ఉంగరాలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ప్లాస్టిక్ సంచిలో కుక్కిన ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం .. పహాడీషరీఫ్ నుంచి తుక్కుగూడకు వెళ్లే దారిలో సర్దార్‌నగర్ గేట్ సమీపంలోని జేటీ హోల్డింగ్ కంపెనీ పక్కన ప్లాస్టిక్ సంచి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన వాచ్‌మన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మహేశ్వరం డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సంచిని విప్పి చూడగా.. అందులో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి వయసు 30– 35 ఏళ్లు ఉంటుంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మూడురోజుల క్రితమే హత్య?

మహిళ మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి మూడు రోజుల క్రితమే హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మెడకు టవల్ బిగించి చంపి ఉంటారని చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే పూర్తి స్పష్టత వస్తుందని వివరించారు.

మృతురాలి ఒంటిపై ఉన్న వస్తువులివే..

మృతురాలి మెడలో పసుపురంగు తాడు, కుడి చేతికి రెండు ఎరుపు గాజులు,చేతివేళ్లకు రెండు ఉంగరాలు, పసుపు కలర్ జాకెట్,చాక్లెట్ కలర్ లంగా, ఎరుపు రంగు చీర,నలుపు మరియు ఎరుపు రంగు చెప్పులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆనవాళ్లు కలిగిన ఎవరి సంబంధీకులైనా అదృశ్యమై ఉన్నట్లయితే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ (ఫోన్ నంబర్: 9490617241)లో సంప్రదించాలని సూచించారు.



గోదామును పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఈవీఎం గోదాం పరిశీలన

అనంతగిరి: వికారాబాద్‌లోని ఈవీఎం గోదాంను అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం సీల్ తొలగించారు. ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచే గదులను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట వికారాబాద్ తహసీల్దార్ వహీదా ఖాతున్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవీందర్ దత్తు, వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

దేశ ప్రజల కోసమే బీఆర్‌ఎస్

- ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి
- కార్యకర్తలే నా బలం బలగం: ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం టీఆర్‌ఎస్ ఏర్పాటు కాగా నేడు దేశ ప్రజల కోసం బీఆర్‌ఎస్ ఆవిర్భవించిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ బొంరాస్‌పేట మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యేకు సంఘీభావం ప్రకటించారు. నరేందర్‌రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ – బీజాపూర్, మహబూబ్‌నగర్ –తాండూర్ రోడ్లకు జాతీయ రహదారులు మార్చిన ఘనత టీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు.కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు,గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజల ముంగిట ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలే తన బలం బలగమన్నారు. అభిమానుల అండదండలతోనే తాను ఎమ్మెల్యేగా ఉన్నానని అన్నారు. వారి కోసం తాను ఎంత దూరమైనా రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని తండాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా త్వరలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు.కార్యక్రమంలో బొంరాస్‌పేట మండల నాయకులు చాంద్‌పాషా,యాదగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, హేమీబాయి, నారాయణరెడ్డి, నరేష్ గౌడ్, దేశ్యానాయక్, టీటీ రాంనాయక్, కొడంగల్ రెండో వార్డు కౌన్సిలర్ మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షను సక్సెస్ చేద్దాం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడంపై ఈ నెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్‌లో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని ఆరోపించారు. ఎంపీ క్వార్టర్స్‌ను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం వెనుక పెద్ద కుట్రే ఉందన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను ఏకరువు పెట్టినందుకే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. సత్యాగ్రహ దీక్షకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు.సాయంత్రం 4 గంటలకు జరిగే సభకు పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ మురళి, నాయకులు రెడ్యా నాయక్, హసీబ్, శ్రీనివాస్ ముదిరాజ్, బాలకృష్ణ, విజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రెడ్డికి డాక్టరేట్

పరిగి: డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డికి పీహెచ్‌డీలో డాక్టరేట్ లభించింది. టీఆర్‌ఆర్ మెడికల్ కళాశాల చైర్మన్‌గా ఉన్న ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై ప్రొఫెసర్ డాక్టర్ శేఖర్ పర్యవేక్షణలో పీపీసీ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ ఇన్ తెలంగాణ అనే అంశంపై అధ్యయనం చేశారు. ఇందుకు సంబంధించిన రిపోర్టును ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించారు. దీంతో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బుధవారం ఆయన అవార్డు అందుకున్నారు. త్వరలో వైస్ చాన్స్‌లర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మెడికల్ హబ్‌గా వికారాబాద్

వికారాబాద్ మెడికల్ హబ్‌గా మారనుంది.. ఇప్పటి వరకు ఏరియా ఆస్పత్రికే పరిమితమైన ఈ ప్రాంతంలో నేడు మెడికల్ కళాశాల, 280 పడకల ఆస్పత్రి పనులు ప్రారంభం కాగా, తాజాగా మరో రెండు వైద్య సంస్థలు ఆయుష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ సెంటర్ ఏర్పాటు కానుండడం వైద్య పరంగా గొప్ప ముందడుగనే చెప్పవచ్చు.

- నేడు ఆయుష్ ఆస్పత్రి పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన
- రూ. 15 కోట్లతో పనులు
- మరో రూ. 3.6 కోట్లతో సెంట్రల్ డ్రగ్ సెంటర్‌కు భూమిపూజ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి వైద్య కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: జిల్లా కేంద్రం మెరుగైన ఆరోగ్య సదుపాయాలకు అడ్డాగా మారుతోంది. రోజుకో సంస్థ వస్తుండడంతో వైద్యం పరంగా జిల్లాకు మంచి రోజులు రానున్నాయి. ప్రస్తుతం తాండూరులో జిల్లా ఆస్పత్రి ఉండగా జిల్లా కేంద్రం వికారాబాద్‌లో మాత్రం ఏరియా ఆస్పత్రే ఉంది. ఇటీవల జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కాగా ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఔషధ మొక్కలకు నిలయంగా పేరున్న అనంతగిరి గుట్టపై ఉన్న టీబీ శానిటోరియంలో వైద్య కళాశాలను ప్రారంభించగా, గుట్టకు వెళ్లే దారిలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 280 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తాజాగా మరో రెండు వైద్య సంస్థలు ఆయుష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ సెంటర్ జిల్లాకు మంజూరు కాగా గురువారం ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, జిల్లా మంత్రి సబితారెడ్డితో కలిసి వాటికి భూమి పూజ చేయనున్నారు.

రూ. 15 కోట్లతో ఆయుష్ ఆస్పత్రి

వికారాబాద్‌లో రూ. 15 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆస్పత్రిని నిర్మించనున్నారు. ఇందులో రూ. 7.6 కోట్లు వెచ్చించి ఆస్పత్రి భవనాన్ని, మరో రూ. 7.4 కోట్లతో పరికరాలు, ఫర్నిచర్, మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయనున్నారు. అలాగే సెంట్రల్ డ్రగ్ సెంటర్‌కు మంజూరైన రూ. 3.6 కోట్లతో ఔషధ గిడ్డంగి నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేయనున్నారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న 280 పడకల ఆస్పత్రి పనులను, వైద్య కళాశాల పనులను మంత్రి పరిశీలిస్తారు. తొలుత హరీశ్‌రావు గుట్టపై వెలసిన అనంత పద్మనాభస్వామిని దర్శించుకుని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి మర్పల్లిలో జరగనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి పాల్గొంటారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలో గురువారం ఆయుష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ కేంద్రాలకు ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వేర్వేరుగా పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల గురించి సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. తాత్కాలికంగా చేపడుతున్న వైద్య కళాశాల, ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పరిపాలనా, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాల పనులను పరిశీలించారు. వాటికి సంబంధించిన పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ పల్వాన్‌కుమార్, డీసీహెచ్‌ఓ ప్రదీప్‌కుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, కళాశాల సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, ఈఈ శ్రీనివాస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో దూకి వ్యక్తి మృతి


చిన్న(ఫైల్)

దోమ: బావిలో దూకిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దోమ పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ విశ్వజన్, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. దిర్సంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుడగ జంగం చిన్న(26) తన భార్య మంజుల ఏడాది కూతురు రేణుకతో కలిసి మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రానికి వచ్చారు. అక్కడ పని పూర్తి చేసుకున్న తర్వాత భార్య, కూతురును అత్తగారి ఇంటికి వెళ్లమని చెప్పాడు. తరువాత ఆయన మండల కేంద్రంలోని వైన్స్‌లో మద్యం సేవించాడు. అనంతరం దిర్సంపల్లి వైన్స్‌లోనూ మద్యం సేవించాడు. దీంతో అతని పరిస్థితి అదుపు తప్పడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి పడుకోబెట్టినప్పటికీ.. తాగిన మైకంలో సమీపంలో ఉన్న చెదురు బావిలోకి దూకాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతని కోసం బావిలోకి దూకి గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గంటపాటు శ్రమించి అతడి మృతదేహాన్ని వెలికితీశారు.

బాలిక మృతదేహం లభ్యం


శిరీష(ఫైల్)

యాలాల: మతిస్థిమితం లేని ఓ బాలిక మంగళవారం చెరువులో దూకి గల్లంతైంది. యువతి మృతదేహం బుధవారం లభ్యమైంది. అగ్గనూరు అనుబంధ గ్రామం మల్‌రెడ్డిపల్లికి చెందిన గంగుల శిరీష(16)కు మతిస్థిమితం సరిగ్గాలేదు. మంగళవారం సాయంత్రం స్థానిక రెడ్డి చెరువులోకి దూకడంతో గల్లంతయింది. అదే రోజు రాత్రి వరకు చెరువులో గాలించినప్పటికీ ఫలితం లభించలేదు. బుధవారం ఉదయం కోట్‌పల్లికి చెందిన గజ ఈతగాళ్లతో పాటు తాండూరు ఫైర్ సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం శిరీష మృతదేహాన్ని ఈతగాళ్లు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐవీఎఫ్ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంతోష్


నియామకపత్రాన్ని అందుకుంటున్న సంతోష్ కుమార్

తాండూరు టౌన్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన రొంపల్లి సంతోష్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఐవీఎఫ్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్న సేవా కార్యక్రమాలను విస్తరింపజేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన శ్రీనివాస్‌గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ..

కూలీ మృతి

ఇబ్రహీంపట్నం: వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ఢీకొని కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. మంచాల మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వి.భిక్షపతి(55) చర్లపటేల్‌గూడకు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులకు కూలి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ ఢీకొట్టడంతో భిక్షపతి మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భానుడి భగ భగ!

జిల్లా పరిధిలో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
మే నెలలో మరింతగా వేడి పెరిగే సూచనలు ఉన్నాయంటూ ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
పెరుగుతున్న ఎండలకు తోడు ఉక్కపోత.. వడగాలుల ప్రభావం ఉంటుందంటున్నారు.



ముదురుతున్న ఎండలు
- వేడిగాలులతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

బొంరాస్‌పేట: రెండు రోజులుగా ఎండలు ముదురుతున్నాయి. వేసవికాలం మంటలు రాజుకుంటున్నాయి. ముందు జాగ్రత్తలు పాటిస్తే వేసవితాపం, వడదెబ్బ నుంచి దూరంగా ఉండవచ్చునని వైద్యులు సూచిస్తునారు. వేసవిలో శరీరం ఎక్కువగా డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లోని ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద వీటిని పొందవచ్చు.

వడదెబ్బను ఎదుర్కొనేందుకు..
- శరీరం కోల్పోయే నీటిని భర్తీ చేయడానికి తరచూ నీరు తోపాటు కొబ్బరి నీళ్లు, తైదల(రాగుల) గంజి, అంబలి వంటివి తీసుకోవాలి.
- ఎండలో తిరిగే వారు లేతరంగు, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- ఎండలో వెళ్లేప్పుడు టోపీ, గొడుగులాంటివి ఉపయోగించాలి.
- ఎండ వేడిమి నుంచి కళ్లు మండకుండా చలువ అద్దాలు వాడాలి.
- వేడిని కలిగించే ఆహారానికి దూరంగా ఉండాలి. సాంబారు, రసం మంచిది. మసాలాలు, నూనెలు, మాంసాహారం తగ్గించాలి.
- పచ్చి కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- పానీయాల్లో ఐస్‌ను వాడరాదు.
- నిమ్మకాయ రసం పిండిన నీటిలో కొంచె చక్కెర, చిటికెడు ఉప్పు కలిపి సేవించాలి.
- తలనొప్పి ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

పొంచి ఉన్న వ్యాధులు

కలుషిత జలాల వినియోగం వల్ల ఉయేరియా, శ్వాసకోశ ఇబ్బందులు, వైరల్ జ్వరాలు, చర్మంపై దద్దుర్లు, దగ్గు, జలుబు, కలరా, హెపటైటీస్–ఏ,సీ, ఈ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది.

జంక్ ఫుడ్‌తో జరభద్రం

వేసవితాపానికి ఉపశమనం పొందేందుకు ఐక్రీమ్ లాంటి జంక్ ఫుడ్ తీసుకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు వాటికి దూరంగా ఉండాలని సలహాలిస్తున్నారు.

జాగ్రత్తలే రక్ష



వేసవిలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో నీరు కలుషితం కాకుండా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయిస్తాం. చెత్తా పడకుండా ట్యాంకులపై మూతలు ఉండేలా ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాగ్రత్తలు తీసుకోవాలి. మూడు నెలలకు ఒకసారి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రంచేయాలి.

– రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి, బొంరాస్‌పేట

వైభవంగా పల్లకీ సేవ

తాండూరు: పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో జాతర తొలిఘట్టమైన పల్లకీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి 11గంటలకు ప్రారంభించారు. మంగళవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పట్టణంలోని పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు కొనసాగింది. పల్లకీ సేవ సందర్భంగా భక్తుల భజనలు, పురంతయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పట్టణమంతా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.



స.హ. చట్టం బోర్డులు ఏర్పాటు చేయండి

పౌర, మానవ హక్కుల సంస్థ వినతి

దోమ: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం 2005 సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పౌర, మానవ హక్కుల సంస్థ బృందం సభ్యులు సంజీవ్‌కుమార్, శేఖర్, కిష్టయ్య, రాఘవేందర్‌రెడ్డి, సద్దాం, నరేశ్‌కుమార్, పాండు, నర్సింహులు కోరా రు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కార్యాలయాల్లో బోర్డులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ప్రతీ కార్యాలయంలో బోర్డులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం సంస్థ సభ్యులు

అమ్మా.. వ్యాపారం ఎలా ఉంది?

వ్యాపారులతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని అంగడి బజార్‌లో బుధవారం జరిగిన వారాంతపు సంతను ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సందర్శించారు. సంతలో ఉన్న సౌకర్యాలు, వసతుల గురించి ఆరా తీశారు. మహిళలు, చిరు వ్యాపారులతో మాట్లాడారు. అమ్మా.. కూరగాయల వ్యాపారం ఎలా ఉందని ప్రశ్నించారు. ధరలు గిట్టుబాటు అవుతున్నాయా అని తెలుసుకున్నారు. సంతలో ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని కోరారు. అనంతరం పట్టణంలోని 2వ వార్డులో హైమాస్టు బల్బులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, అన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్: సంతలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కంటి వెలుగు.. పేదల ఇంటికి వెలుగు

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదల ఇంటికి వెలుగుగా మారుతోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మెట్లకుంటలో రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కంటి పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కంటి వెలుగు కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రమణారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, దేవేందర్‌గౌడ్ తదితరులున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

అంబేడ్కర్ జయంతి
- ఆయన జన్మస్థలం నుంచి ఐదు పిడికిళ్ల మట్టి
- కాంస్య విగ్రహ ఏర్పాటుకు రేపు భూమి పూజ
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. తాండూరు పరిధిలోని పలువురు దళిత సంఘం నాయకులతో ఆయన మంగళవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ.. నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం హర్షణీయమన్నారు. అలాగే తాండూరు నడిబొడ్డున అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి రోజున హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. తాండూరులో సైతం చరిత్రలో నిలిచిపోయేలా జయంతి వేడుకలను నిర్వహిస్తామన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి.. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆ మహనీయుడి 132 విగ్రహాలను ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. అంతేకాకుండా అంబేడ్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని మిలిటరీ హెడ్ క్వార్టర్స్ ఆఫ్ వార్ ప్రదేశం నుంచి ఐదు పిడికిళ్ల మట్టి తెప్పిచ్చి.. విగ్రహ ఏర్పాటు సమయంలో ఆ మట్టితో భూమిపూజ చేస్తామని తెలిపారు.


పెద్దేముల్: ఎమ్మెల్యేకు గొర్రెపిల్లను బహూకరించిన కురుమలు

'గృహలక్ష్మి'కి దరఖాస్తులు చేసుకోవాలి

పెద్దేముల్: అర్హులందరూ గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. పల్లె పల్లెకు పైలెటర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కందనెల్లితండా, గాజీపూర్, ఖాజాపూర్, బుద్దారం, పెద్దేముల్, పెద్దేముల్ తండా తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, రుద్రారం, నాగులపల్లితో పాటు పలు గ్రామాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం చేకూరుతుందన్నారు. ప్రతీ గ్రామానికి రూ.50లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మీ ఆశీర్వాదంతో మరోసారి ఎమ్మెల్యేగా గెలపించాలని కోరారు. అనంతరం పలు గ్రామాలల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌చారి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ ఎంపీటీసీలు తలారి వీరప్ప, బలవంతు రెడ్డి, ద్యావరి విజయమ్మ, రెగోండి లక్ష్మీ, రమేశ్, రాములు, మట్ట లక్ష్మీ, స్వప్న ధన్‌సింగ్‌తో పాటు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. బుద్దారం గ్రామంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.

'పల్లెబాట'తో సమస్యల పరిష్కారం

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పల్లెబాట కార్యక్రమంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధ/ లోనిల నస్కల్, మిట్టకోడూరు, చిగురాల్‌పల్లి, గోవిందపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీయం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందుతున్నాయా ఏమైనా సమస్యలున్నాయో అని తెలుసుకున్నారు. ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, రైతు సమితి కోఆర్డినేటర్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.


లక్నాపూర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మేధావుల్లో అగ్రగణ్యుడు అంబేడ్కర్

తలకొండపల్లి: ప్రపంచ మేధావుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అగ్రగణ్యుడని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపూర్‌లో యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ తిర్మణీ నిర్మలాశ్రీశైలంగౌడ్, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను పరిశీలించి ఉన్నతంగా రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, కృష్ణ మహేశ్, జ్యోతయ్య, డేవిడ్ సుధాకర్, శంకర్, రఘురాములు, మాజీ సర్పంచ్ శ్రీనివాసాచారి, సింగిల్ విండో డైరెక్టర్ నయీం, హరిమోహన్‌రెడ్డి, అజీజ్, రేణురెడ్డి, యాదయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

చేవెళ్ల: డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎండీ అంజద్‌కు ఫాతిమా (21), సలీమా కుమార్తెలు సంతానం. వీరిద్దరూ చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఎప్పటిలాగే మంగళవారం అక్కాచెల్లెలు కళాశాలకని వచ్చారు. సాయంత్రం కళాశాల నుంచి చేవెళ్ల బస్‌స్టేషన్‌కు వచ్చి షాబాద్ బస్సు రాగానే చెల్లెలు సలీమా బస్సు ఎక్కింది. ఫాతిమా వాటర్ బాటిల్ తీసుకొస్తానని చెప్పివెళ్లి తిరిగి రాలేదు. ఎంతకూ అక్క జాడ తెలియకపోవడంతో సలీమా తల్లిదండ్రులకు సమాచారం అందించింది. రాత్రి వరకు తమ కూతురు ఇంటికి చేరుకోకపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. బుధవారం చేవెళ్ల పీఎస్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హయూమ్ తెలిపారు.

ఐదుగురు టీచర్లకు తప్పిన ప్రమాదం

ఆటోను తప్పించబోయి కారు బోల్తా

కందుకూరు: ఎదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయి కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి, మరుధ్వతి, భాను, భారతి, విద్యావతి కడ్తాల్ మండలం ముద్విన్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యం హైదరాబాద్ నుంచి కారులో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో కందుకూరు మండలం నేదునూరు గేటు సమీపంలో ఎదురుగా దూసుకొచ్చిన ఆటోను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. అయితే ఎవరికి గాయాలు కాకుండా తప్పించుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


ప్రమాదంలో బోల్తా పడిన కారు

రేషన్ అక్రమాలకు చెక్

- గ్రామస్థాయి నుంచి విజిలెన్స్ కమిటీలు
- ప్రతీ మూడు నెలలకోసారి సమీక్ష
- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



వికారాబాద్ అర్బన్: రేషన్ అక్రమ రవాణాకు ఇక అడ్డుకట్ట పడనుంది. అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు, లబ్ధిదారులకు రేషన్ బియ్యం సక్రమంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టాయి. ఆహార భద్రత పథకాన్ని మరింత పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు, ఇందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో మూడు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల ద్వారా డివిజన్, మండల, గ్రామ స్థాయిలో మానిటరింగ్ చేస్తారు. అలాగే ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షిస్తారు. ఆహార భద్రత కార్డులు ఉన్న వారందరికీ రేషన్ సరుకులు సక్రమంగా అందేలా ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీల ఏర్పాటుకు సివిల్ సప్‌లై అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

మూడు నెలలకు ఒక్కసారి సమీక్ష

జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. మానిటరింగ్ కమిటీల్లో ఆయా శాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు చోటు కల్పించనున్నారు. కమిటీల ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒక్క సారి రేషన్ సరఫరాపై సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలోని విజిలెన్స్ కమిటీలకు సర్పంచ్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. వార్డు సభ్యులు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సభ్యులుగా అవకాశం కలిస్తారు. రేషన్ డీలర్, అంగన్‌వాడీ టీచర్, ఆర్ఐ, ఐదుగురు రేషన్ లబ్ధిదారులకు కమిటీలో చోటు కల్పించనున్నారు.

జిల్లాస్థాయిలో విజిలెన్స్ కమిటీ

విజిలెన్స్ కమిటీకి జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా జెడ్పీ సీఈఓ, డీఈఓ, ఐసీడీఎస్ అధికారి, డీటీడీఓ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, జిల్లా లీగల్ మెథడాలజీ అధికారి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌తో పాటు ఇద్దరు జెడ్పీటీసీలకు కమిటీలో అవకాశం కల్పించనున్నారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. రేషన్ దుకాణాలు, కిరోసిన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి కూడా కమిటీలో చోటు కల్పించనున్నారు. ఈ కమిటీకి సివిల్ సప్‌లై జిల్లా అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఆయన ఆధ్వర్యంలో మూడు నెలలకు ఒక్కసారి సమావేశాలు నిర్వహిస్తారు.

డివిజన్ స్థాయిలో

డివిజన్ కమిటీలో అదనపు కలెక్టర్ లేదా ఆర్డీఓ చైర్మన్‌గా ఉంటారు. ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసే ఏఓ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, జెడ్పీటీసీలు, మండల అధికారులు, ఐసీడీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల అధికారులు, సివిల్ సప్‌లై నాయబ్ తహసీల్దార్లు సభ్యులుగా ఉంటారు. రేషన్ దుకాణాల డీలర్ల సంఘం మండల అధ్యక్షుడితో పాటు ఆర్డీఓ నియమించిన మరో ఇద్దరు ఎస్సీ, ఎస్టీ సభ్యులకు కమిటీలో అవకాశం కల్పించనున్నారు.

సర్వీస్ కాలాన్ని రెగ్యులరైజ్ చేయండి

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ కోశాధికారి రవిశెట్టి

మర్పల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల సర్వీస్ కాలాన్ని రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కమిటీ కోశాధికారి రవి శెట్టి ప్రభుత్వాన్ని కోరారు. వారు ప్రొబెషన్ కాలన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్ కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి శెట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించి పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ రాజమల్లయ్య, సూపరింటెండెంట్ కృష్ణారావు, ఈఓపీఆర్‌డీ మహేశ్‌కుమార్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నాగయ్య, మండల కోశాధికారి అశోక్ కుమార్, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్, పంచాయతీ కార్యదర్శులు